# 10 ఇళ్ల దొంగతనం కేసులు ఛేదించిన కోదాడ పోలీసులు

## -రూ.60 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం.. నిందితుడు అరెస్ట్

(కోదాడ మండల) ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు, జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ నరసింహ ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు. పట్నం శెట్టి రాజు అలియాస్ రాజిరెడ్డి (41) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, హోండా అమేజ్ కారు, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. 2021 నుంచి కోదాడలో 10 ఇళ్లలో, 2026లోనే ఏడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వాహన తనిఖీల సమయంలో పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాల వివరాలు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఏర్పాటు



చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసు ఛేదనలో కృషి చేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్, కోదాడ పట్టణ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు

# టవర్ నిర్మాణంపై పాయకరావుపేట వాసుల అభ్యంతరం

## కొత్త టవర్ పనులు నిలిపివేయాలని హోంమంత్రి వంగలపూడి అనితకు వినతి



పాయకరావుపేట సెప్టెంబర్ 9 ప్రజా న్యూస్ నెట్వర్క్:

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలోని ప్రశాంతి నగర్, షీలా నగర్, బృందావనం కాలనీ, ధనిశెట్టి నగర్ తదితర ప్రాంతాల్లో కొత్తగా చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం పంపించారు.కాలనీలో ఇప్పటికే రెండు సెల్ టవర్లు ఉన్నాయని స్థానికులు తెలిపారు. వాటి నుంచి వెలువడుతున్న రేడియేషన్ కారణంగా వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. తరచూ జ్వరాలు, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కుటుంబ పోషణ కోసం కూలి పనులు చేసి సంపాదించిన డబ్బులో కొంత భాగం ఆసుపత్రి ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కాలనీలో చిట్టిమల్ల జోగారావుకు చెందిన ప్రైవేట్ భవనంపై మరో సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై భవన యజమాని, టవర్ సూపర్‌వైజర్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరించినప్పటికీ స్పందించలేదని వారు ఆరోపించారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికే ఉన్న సెల్ టవర్ల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్న స్థానికులు, మరో టవర్ నిర్మాణంతో ఆందోళన మరింత పెరిగిందన్నారు. ఈ వ్యవహారంపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించి, కొత్త సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పాయకరావుపేట వాసులు విజ్ఞప్తి చేశారు.

# తునిలో 53 దీపాలతో టీడీపీ కార్యక్రమం

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మహిళల ఆధ్వర్యంలో దీప ప్రజ్వలన..

## క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న యనమల రాజేష్








తుని సెప్టెంబర్ 9 ప్రజా న్యూస్ నెట్వర్క్:

చంద్రబాబును 53 రోజుల పాటు నిర్బంధించిన ఘటనకు నిరసనగా తుని పట్టణ కూటమి కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు 53 దీపాలను వెలిగించారు. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు చేస్తూ జైలుకు పంపిన ఘటనపై పార్టీ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన దీపాలు వెలిగించారు. అనంతరం నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్నారు.

వైకాపా పాలనలో వ్యవస్థల విధ్వంసం జరిగిందని, నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబుపై అవినీతి మరక అంటించి జైలుకు పంపించారని వారు ఆరోపించారు. 53 రోజుల నిర్బంధాన్ని అన్యాయంగా పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చంద్రబాబుపై నమోదైన కేసులు, ఆయన అరెస్టు వ్యవహారంలో తమ వైఖరిని వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణులు దీపాలు వెలిగించారు. 'నిజం గెలిచింది' అంటూ కార్యక్రమంలో నినాదాలు చేశారు.

కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, సీనియర్ నేత మోతుకూరి వెంకటేష్, గవర కార్పోరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, కారుమూరి భద్రరావు, తటవర్తి రాజా, పరవాడ తాత బాబు, షేక్ ఇషాన్, ఎస్.కె. వల్లి, కూరపాటి రఘు, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు

# వినాయక విగ్రహాల వివరాలను పోలీసులకు అందజేయాలి

## హుజూర్‌నగర్ మండల ప్రజలకు ఎస్ఐ నరేష్ సూచన

(హుజూర్‌నగర్ మండలం)ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ మండల, గ్రామ ప్రజలకు ఎస్ఐ సి.హెచ్. నరేష్ ఒక ముఖ్య ప్రకటన చేశారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాలకు సంబంధించిన పూర్తి వివరాలను



సంబంధిత నమోదు లింక్‌లో నమోదు చేసి, ఆ వివరాల ప్రతిని హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# పదవులు రాని వారు నిరాశ చెందొద్దు: జగ్గారెడ్డి

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 9:

పార్టీలో పదవులు వచ్చినా, రాకపోయినా ప్రతి కార్యకర్తను గుర్తిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కిసాన్ సెల్ తదితర కమిటీలను ప్రకటించారు.త్వరలో మండలాల



వారీగా సమావేశాలు నిర్వహించి ప్రతి కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతానని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా మధుమతి శ్యామల వెంకమ్మదేవి ఆరాధన మహోత్సవం

## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, భక్తులు

(సదాశివపేట మండల), సెప్టెంబర్ 8, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షెల్మేడా అనిల్ కుమార్ :సదాశివపేట పట్టణంలోని శ్రీ శ్రీ మాణిక్ ప్రభు ఆలయ ప్రాంగణంలో మధుమతి శ్యామల వెంకమ్మదేవి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కవిత రామదాసి నేతృత్వంలో సుమారు 100 మంది మహిళలు అష్టోత్తర నామాలు, సహస్రనామాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహా హారతి, తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా పులిమామిడి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వైద్యం గోపి ప్రియాంక పవన్, మాజీ కౌన్సిలర్ మాణిక్ రావు, ఆలయ అధ్యక్షులు చిదానందం, చింత సాయి, శివరాజ్ పాటిల్, శరత్ చంద్ర, విజయ్ కుమార్ యాదవ్, వి. చంద్రశేఖర్, ఎం. మనోహర్, బల్లెం లక్ష్మయ్య, జి. ప్రభు తదితరులు పాల్గొన్నారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



# ఈ నెల 12న జాతీయ మెగా లోక్ అదాలత్

## రాజీ పడదగిన కేసులను సద్వినియోగం చేసుకోవాలి: సీఐ చరమందరాజు

(హుజుర్ నగర్ నియోజకవర్గం) సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :ఈ నెల 12న శనివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు కోరారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ వివాదాలు, వైవాహిక సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, మోటారు వాహనాల నిబంధనల ఉల్లంఘన, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్నచిన్న వివాదాలతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీయే రాజమార్గమని పేర్కొంటూ, లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల అంగీకారంతో కేసులను త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీకి అర్హమైన కేసులను



గుర్తించి సంబంధిత కక్షిదారులకు సమాచారం అందించి, ఇరువర్గాలను పిలిపించి అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బందికి సూచించారు. తమ కేసును రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని, అవసరమైన వివరాలు తెలుసుకుని లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని సీఐ చరమందరాజు కోరారు.

# జర్నలిస్టు షేక్ సైదాను పరామర్శించిన కౌన్సిలర్ కృష్ణ

(హుజూర్‌నగర్ మండలం), సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధి :తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు షేక్ సైదా అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న 19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. సైదా ఎన్నో ఏళు ్గా పాత్రికేయ రంగంలో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో



కీలక పాత్ర పోషిస్తున్నారని కృష్ణ అన్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ముజావర్ సైదా, మీరా తదితరులు పాల్గొని సైదా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## గృహ నిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలి

(హుజూర్‌నగర్ మండల) ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్ట వద్ద గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్



బండా కవిత, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కమిషనర్ కే. సతీష్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి జీతభత్యాలు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వినాయక చవితి, దేవి నవరాత్రులపై త్రిపురారంలో శాంతి సమావేశం

## పండుగల నిర్వహణలో నిబంధనలు అందరికీ సమానంగా ఉండాలి: -రమేష్

(త్రిపురారం మండల) ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :

త్రిపురారం మండల కేంద్రంలో వినాయక చవితి, దేవి నవరాత్రుల సందర్భంగా సీఐ రాఘవరావు, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రెమడాల రమేష్ మాట్లాడుతూ హిందూ పండుగల నిర్వహణలో నిబంధనలు, అనుమతుల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి నిర్వహించే రైతులు, ప్రజలకు అవసరమైన అనుమతులు సులభంగా ఇవ్వాలని, డీజే అనుమతుల విషయంలోనూ సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు మెరుగు మహేష్, జానకిరామ్ రెడ్డి, మేకల రామకృష్ణ, మేకల మధు, పడిశాల హరికృష్ణ, మామిడి మహేష్, చెరుకుపల్లి శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.



